అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

భూపాలపల్లి జిల్లాలో
## భారీగా ఎస్సైల బదిలీలు
02

అటవీ ప్రాంతంలో
## ప్రేమజంట ఆత్మహత్య
గోవిందరావుపేట మండలంలో విషాదం 04



మంగళవారం 9, జూన్ 2026 సంపుటి :03 సంచిక :119 పేజీలు :05 వెల ₹5

వ్యవసాయ పనుల్లో
## రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

03



గడువు ముగిసినా రాని
## ఉత్తర్వులు
- 'కో-ఆప్షన్' ఎన్నికలపై ఆశావహుల ఎదురుచూపు

03





- సేవలను నిర్దేశిత గడువులోగా అందించాలి
- ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- పరకాల మున్సిపాలిటీ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం

# పారదర్శకత పాటించాలి

మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

పరకాల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్-1 అధికారి పోతరాజు పవన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విధుల నిర్వహణ, మున్సిపాలిటీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్ర అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య, ఘన వ్యర్థాల, వీధి దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, మౌలిక వసతుల కల్పన, ఇంటి నంబర్ల కేటాయింపు, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ, వివిధ గ్రాంట్ల కింద నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు.

-అక్షరదర్బార్, పరకాల

04

నేడు 'స్టేషన్'లో
## భట్టి పర్యటన
- సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

04





అటవీ ప్రాంతంలో
## గుప్తనిధుల అన్వేషణ
03

అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణ



## చిరంజీవి కుటుంబానికి 'జనతా ట్రస్ట్' రూ. 20 వేల ఆర్థిక సాయం

చెన్నారావుపేట, అక్షరదర్బార్: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన చీకటి చిరంజీవి చిన్న కుమారుడు సాయి ఇటీవల హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం కాలు, చెయ్యి సమస్యలతో చికిత్స పొందుతున్నాడు. హాస్పిటల్ ఖర్చులకు ఆ కుటుంబం ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామ యువకులు జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన చైర్మన్, ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించి, రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను కోరారు. చీకటి చిరంజీవి కుటుంబానికి జనతా ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చైర్మన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుంకదువ్వ రంజిత్, జూలూరి మనీష్, కొంకిస విఘ్నేష్, బక్కతట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి

○ సర్పంచ్ బండి రేణుక శంకర్

నడికూడ, అక్షరదర్బార్: "మన ఊరు బడి.. మన పిల్లల బంగారు భవిష్యత్తు" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడులను ఆదరించాలని చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 'బడిబాట' కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో, నాలుగేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు పుల్లూరి రామకృష్ణ, తల్లిదండ్రులు చిరంజీవి, సుధ పాల్గొన్నారు.




## 14న 'అస్మిత ఖేలో ఇండియా' బాలికల సైక్లింగ్ పోటీలు

ములుగు, అక్షరదర్బార్: ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 14న 'అస్మిత ఖేలో ఇండియా' మహిళల, బాలికల సిటీ సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్ అందజేస్తామని, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ సొంత సైకిల్, ఆధార్ కార్డు జిరాక్స్ తెచ్చుకోవాలని, ఆసక్తి గలవారు ఈ నెల 12వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ (8886817492) ను సంప్రదించాలని కోరారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

○ ఆర్డీఓ ఉమారాణి

దుగ్గొండి, అక్షరదర్బార్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు దీనిపై చైతన్యం కల్పించాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి సూచించారు. దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో సర్పంచ్ కొలుగూరి సుజాత అధ్యక్షతన నిర్వహించిన అవగాహన గ్రామసభకు ఆర్డీఓ ఉమారాణి, డీఎస్ఓ కిష్టయ్య, తహసిల్దార్ సమ్మక్క ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీఓ.. స్పెషల్ ఇంటెన్సివ్ రీజన్ ప్రాధాన్యతను వివరిస్తూ, గ్రామసభకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సర్పంచ్ సుజాత మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో గ్రామాభివృద్ధి జరుగుతోందని, తాను సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటివరకు రూ. 30 లక్షల విలువైన పనులు చేయించామని తెలిపారు. ప్రజల సహకారంతో రేకంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, జిపిఓ ఉదయ్, వార్డు మెంబర్లు బొమ్మర వేణు, నరసింహస్వామి, తోటి విజయ, మట్టెవాడ రాజయ్య, ఇసంపల్లి సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.




# గడువు ముగిసినా రాని ఉత్తర్వులు

○ 'కో-ఆప్షన్' ఎన్నికలపై ఆశావహుల ఎదురుచూపు



మొగుళ్ళపల్లి, అక్షరదర్బార్: గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి రెండు మాసాలు పూర్తి అయినా కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం పాలకవర్గం కొలువుదీరిన 60 రోజుల్లోగా ప్రతి పంచాయతీకి ముగ్గురు చొప్పున (రిటైర్డ్ ఉద్యోగి/సీనియర్ సిటిజన్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు/స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, భూదాతలు/ఎన్నారైలు) కో-ఆప్షన్ సభ్యులను నియమించాల్సి ఉంది. వార్డు సభ్యులతో సమాన హోదా ఉండే ఈ పదవులపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని 26 పంచాయతీల పరిధిలో పలువురు ఆశావహులు నిరీక్షిస్తున్నారు. దీనిపై మొగుళ్ళపల్లి ఎంపీడీఓ సురేందర్ గౌడ్ వివరణ ఇస్తూ.. కో-ఆప్షన్ సభ్యుల నియామకంపై ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, ఆదేశాలు వచ్చిన వెంటనే ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఆశావహుల కోరిక మేరకు ప్రభుత్వం స్పందించి, అతి త్వరలోనే ఈ కో-ఆప్షన్ ఎంపికను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

## హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు వాకర్స్ అసోసియేషన్ ఘన సన్మానం

శాయంపేట, అక్షరదర్బార్: శాయంపేట పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌ను సోమవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రతి ఒక్కరూ నిత్యం వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. తనను సన్మానించినందుకు అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పరకాల రఘు, ఉపాధ్యాయులు దేవయ్య, ప్రధాన కార్యదర్శి బంక రమేష్, కార్యదర్శులు పరికి రమేష్, కుక్కల రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, శ్రీహరి, సారంగపాణి, ప్రభాకర్, జయప్రకాష్, సాంబమూర్తి పాల్గొన్నారు.



## చిట్యాలలో ఉచిత 'స్టీల్ బ్యాంక్' ప్రారంభం

సర్పంచ్ లక్ష్మీ అంతయ్య



చిట్యాల, అక్షరదర్బార్: మండల కేంద్రమైన చిట్యాల గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ నియంత్రణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన 'స్టీల్ బ్యాంక్'ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు సర్పంచ్ తౌటమ్ లక్ష్మీ అంతయ్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో పెళ్లిళ్లు, శుభకార్యాలకు ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా స్టీల్ బ్యాంక్ సామాగ్రిని ప్రజలు ఉచితంగా వాడుకోవచ్చన్నారు. ఈ బ్యాంక్ కోసం రూ. 60,000 విలువైన 500 స్టీల్ ప్లేట్లు, 500 గ్లాసులను విరాళంగా అందించిన శ్రీ ముప్పుడోజు నరేంద్రాచారికి కృతజ్ఞతలు తెలిపారు. వాడుకున్న సామాగ్రిని తిరిగి శుభ్రం చేసి పంచాయతీకి అప్పగించాలన్నారు. "ప్లాస్టిక్ రహిత – పర్యావరణ హిత చిట్యాల" నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



| | | | |
|---|---|---|---|
| 1. | Ch. Srinivas | DSB, JS Bhupalpally | SHO, Kataram PS |
| 2. | J. Mahesh | VR JS Bhupalpally, | SI-II, Kataram PS |
| 3. | P. Mahender Kumar | SHO, Adavimutharam PS | SHO, Koyyur PS |
| 4. | A. Kalyan | VR, JS Bhupalpally | SI-II, Koyyur PS |
| 5. | G. Ramesh | SI-II, Bhupalpally PS | SHO, Adavimutharam PS |
| 6. | T. Sai Shashank | VR JS Bhupalpally | SHO, Palimela PS |
| 7. | M. Sambamurthy | SI-I, Bhupalpally PS | SHO, Mahadevpur PS |
| 8. | J. Ramesh | SHO, Palimela PS | SI-II, Mahadevpur PS |
| 9. | K. Pavan Kumar | SHO, Mahadevpur PS | SI-I, Bhupalpally PS |
| 10. | V. Rajan Kumar | VR JS Bhupalpally | SI-II, Chityal PS |
| 11. | V. Naresh | SHO, Koyyur PS | DSB, JS Bhupalpally |
| 12. | R. Ashok | VR, JS Bhupalpally | DSB, JS Bhupalpally |
| 13. | A. Srinivas | VR, JS Bhupalpally | DSB, JS Bhupalpally |

# భూపాలపల్లి జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీలు

భూపాలపల్లి క్రైమ్, అక్షరదర్బార్: భూపాలపల్లి జిల్లాలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను (ఎస్సైలను) బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఎస్‌బీ భూపాలపల్లి నుండి సిహెచ్ శ్రీనివాస్ కాటారం పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, భూపాలపల్లి విఆర్ నుండి జె మహేష్ ఎస్సై 2గా కాటారానికి బదిలీ అయ్యారు. అడవి ముత్తారం నుండి పి మహేంద్ర కుమార్ కొయ్యూరుకు, వి ఆర్ భూపాలపల్లి నుండి ఏ కళ్యాణ్ ఎస్సై 2గా కొయ్యూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్సై 2 భూపాలపల్లి నుండి జీ రమేష్ అడవి ముత్తారానికి ఎస్ హెచ్ ఓగా బదిలీ కాగా, వీఆర్ భూపాలపల్లి నుండి టీ సాయి శశాంక్ పలిమెలకు ఎస్ హెచ్ ఓగా నియమితులయ్యారు. ఎస్సై వన్ భూపాలపల్లి నుండి ఎం సాంబమూర్తి మహాదేవపూర్‌కు ఎస్ హెచ్ ఓగా వెళ్లగా, జె రమేష్ మహాదేవపూర్ నుండి ఎస్సై 2గా అక్కడే బదిలీ అయ్యారు. కె పవన్ కుమార్ మహాదేవపూర్ నుండి ఎస్సై వన్ భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు రాగా, వీ రాజన్ కుమార్ వీఆర్ భూపాలపల్లి నుండి ఎస్సై 2గా చిట్యాల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ హెచ్ ఓ కొయ్యూరు పోలీస్ స్టేషన్ నుండి వి నరేష్ డీఎస్బీ భూపాలపల్లికి, వి ఆర్ భూపాలపల్లి నుండి ఆర్ అశోక్, ఏ శ్రీనివాస్ ఇద్దరూ డీఎస్బీ భూపాలపల్లికి బదిలీ అయ్యారు. అలాగే ఈ సురేష్ విఆర్ భూపాలపల్లి నుండి డీసిఆర్‌బీ భూపాలపల్లికి బదిలీ కాగా, ఎస్సై 2 చిట్యాల నుండి ఎండి శాఖన్ విఆర్ భూపాలపల్లికి బదిలీపై వెళ్లారు.

## కత్తితో దాడి చేసిన నిందితుడికి 14 రోజుల రిమాండ్: ఎస్ఐ సతీష్



చిట్యాల, అక్షరదర్బార్: భూమి కొనుగోలు వివాదంలో ఒకరిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చిట్యాల సబ్ ఇన్స్పెక్టర్ పోచంపల్లి సతీష్ తెలిపారు. కొత్తపేట గ్రామానికి చెందిన మహ్మద్ రాజ్ మొహమ్మద్, అతని సోదరుడు అఫ్జల్ కలిసి.. అదే గ్రామానికి చెందిన కొండేటి రాజేందర్ ఇంటికి నెలిమెల కుమార స్వామి బండి బాట కొనుగోలు విషయం మాట్లాడటానికి వెళ్లారు. అక్కడ కుమార స్వామి తరపున కౌలుదారు చిగురు నరేష్ కూడా ఉన్నాడు. రాజేందర్ తరపున రాజ్ మొహమ్మద్ గుంట భూమి రూ. 4 లక్షలు అని చెప్పగా, నరేష్ రూ. 1.8 లక్షలకే అడుగుతూ గొడవకు దిగాడు. ఈ కక్షతో కొత్తపేట శివారులో రాజ్ మొహమ్మద్ ట్రాక్టర్ నడుపుతుండగా చిగురు నరేష్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. నిందితుడు నరేష్‌ను సోమవారం భూపాలపల్లి కోర్టులో హాజరుపరచగా, గౌరవ జడ్జి జి. అఖిల నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ పేర్కొన్నారు.

# వ్యవసాయ పనుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

○ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




మొగుళ్ళపల్లి, అక్షరదర్బార్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే పూర్తయిన, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సాదా బైనామా భూములకు చట్టబద్ధ హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎస్ఐఆర్ ఓటరు నమోదు, ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యాల వంటి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, గ్రామప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళేశ్వరం అడవుల్లో గుప్తనిధుల అన్వేషణ

○ ఇద్దరి అరెస్ట్



భూపాలపల్లి క్రైమ్, అక్షరదర్బార్: కాళేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషిస్తున్న ఇద్దరు వ్యక్తులను సీసీఎస్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో నిందితులు పట్టుబడ్డారు. గత ఆరు నెలలుగా వీరు కాలేశ్వరం పరిసర ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం వెతుకుతున్నట్లు విచారణలో వెల్లడించారు. వారి నుంచి అన్వేషణకు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, హనుమకొండ సుధానగర్‌కు చెందిన వలబోజు శ్రీనివాస్‌గా గుర్తించారు. నిందితులను, వస్తువులను తదుపరి చర్యల కోసం కాలేశ్వరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ రమేష్ తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

○ ఎస్పీ సంకీర్త్



భూపాలపల్లి క్రైమ్, అక్షరదర్బార్: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజాదివాస్' కార్యక్రమంలో ఆయన బాధితుల నుండి నేరుగా 15 ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా విని, సంబంధిత సీఐలు, ఎస్ఐలతో ఫోన్లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా చట్టబద్ధంగా న్యాయం చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత చేరువగా ఉంటామని ఎస్పీ పేర్కొన్నారు.



# రసాభాసగా మారిన పిడిసిల్ల గ్రామసభ

### అధికారులపై ప్రజల ఆగ్రహం

మొగుళ్ళపల్లి, అక్షరదర్బార్: మండలంలోని పిడిసిల్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' గ్రామసభ రసాభాసగా మారింది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. పిడిసిల్ల, ఎల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన ఉమ్మడి చెరువులో కొందరు అక్రమంగా రాత్రివేళల్లో చేపలు పట్టి అమ్ముకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై పంచాయతీ తీర్మానం లేకుండా చేపలు పట్టొద్దని, ఆ నిధులను గ్రామాభివృద్ధికి వాడాలని తీర్మానించారు. అలాగే నిత్యం మిషన్ భగీరథ నీరు రాకపోవడంపై, అధికారుల సమయపాలన రాహిత్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొగుళ్ళపల్లి తహసిల్దార్ సునీత, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ సుభాష్, గ్రామ వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# నేడు 'స్టేషన్'లో భట్టి పర్యటన

- సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



అక్షరదర్బార్, చిల్పూర్: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఈ నెల 9న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పల్లగుట్టలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభ స్థలాన్ని, ఏర్పాట్లను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలో రూ.60.62 కోట్ల వ్యయంతో నిర్మించిన, నిర్మించ తలపెట్టిన 7 విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ సందర్భంగా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో సుమారు 6 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సంబంధించి స్టేజ్, ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**మంత్రి పర్యటన వివరాలు ఇవే..**

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి తొలిసారి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా కింద పేర్కొన్న సబ్‌స్టేషన్ల పనులను మంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వేలేరు మండలం పీచరలో 132/33 కేవీ సబ్‌స్టేషన్.. చిల్పూర్ మండలం కొండాపూర్, జఫర్‌గఢ్ మండలం సాగరం, రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామాలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు. చిల్పూర్ మండలం లింగంపల్లి, పల్లగుట్ట, నష్కల్ గ్రామాలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

**మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు**

ఈ పర్యటన సందర్భంగా నియోజకవర్గంలోని పలు కీలక విద్యుత్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా 7 మండలాల్లో ఇళ్లపై నుండి వెళ్తున్న 33/11 కేవీ సర్వీస్ లైన్ల షిఫ్టింగ్ సమస్యను, అలాగే రఘునాథపల్లి కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను 220/132 కేవీ సబ్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రిని కోరనున్నట్లు ఆయన వివరించారు.

**90 శాతం విద్యుత్ సమస్యలకు పరిష్కారం**

ఈ కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో నియోజకవర్గ పరిధిలో దాదాపు 90 శాతం విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఒకే రోజు, ఒకే చోట 7 సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగుతున్నందున నియోజకవర్గ రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు, మండల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకత పాటించాలి

- మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- సేవలను నిర్దేశిత గడువులోగా అందించాలి
- ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- పరకాల మున్సిపాలిటీ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్-1 అధికారి పోతరాజు పవన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విధుల నిర్వహణ, మున్సిపాలిటీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్ర అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య, ఘన వ్యర్థాల, వీధి దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, మౌలిక వసతుల కల్పన, ఇంటి నంబర్ల కేటాయింపు, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ, వివిధ గ్రాంట్ల కింద నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు.

**పారదర్శకంగా..**

మున్సిపల్ సేవలు ప్రజలకు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సేవలను నిర్దేశిత గడువులోగా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. వీధి దీపాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన కమిషనర్ పోతరాజు పవన్ పట్టణ అభివృద్ధి, ప్రజాసేవలకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఏఈ రవీందర్, టీపీఎస్ సుమన, టీపీబీఓ సందీప్, జూనియర్ అకౌంట్స్ అధికారి అర్షద్ తదితరులు పాల్గొన్నారు.



# అటవీ ప్రాంతంలో ప్రేమజంట ఆత్మహత్య

అక్షరదర్బార్, గోవిందరావుపేట: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తమ ప్రేమను తిరస్కరించారనే మనస్తాపంతో ఓ ప్రేమజంట చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కర్లపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గల టేకులకుంట గొత్తికోయ గుంపునకు చెందిన కాశపు కోమల (18), కోరం ఇరమయ్య (18) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే, వీరి ప్రేమను ఇరువైపులా ఉన్న కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఈ యువజంట, తమ ప్రేమ దక్కదనే వేదనతో అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.

**రంగంలోకి పోలీసులు**

స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పస్రా పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన స్థానిక గొత్తికోయ గుంపులో తీవ్ర విషాదాన్ని నింపింది.

# అధ్యక్షుడిగా శ్రీనివాస్ నాయుడు ఎన్నిక



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ జిల్లా సాండ్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఆసక్తికర పోటీ సాగింది. ఈ పోటీలో శ్రీనివాస్ నాయుడు ఘన విజయం సాధించారు. మొత్తం 136 ఓట్లకు గాను 106 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో 92 ఓట్లతో శ్రీనివాస్ నాయుడు అసోసియేషన్ అధ్యక్షునిగా గెలిచారు. ఈ అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నికలు నిర్వహించింది. అసోసియేషన్ అధ్యక్షునిగా మెజారిటీతో విజయం సాధించిన శ్రీనివాస్ నాయుడుని ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేముల భూపాల్, కోశాధికారి ఎండీ జాకీర్, అసోసియేషన్ నాయకులు సోమవారం సన్మానించారు. వరంగల్ జిల్లా సాండ్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలువురు శ్రీనివాస్ నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన

- పాండవులగుట్ట, కేటీపీపీ, బొగ్గు గనుల సందర్శన

అక్షరదర్బార్, భూపాలపల్లి: డా ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2025 బ్యాచ్ ఐఏఎస్ అధికారుల శిక్షణలో భాగంగా "తెలంగాణ దర్శన్" కార్యక్రమం కింద ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఆది, సోమవారం జిల్లాలో పర్యటించారు. పాండవుల గుట్ట (రేగొండ మండలం), కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (చెల్పూర్), సింగరేణి ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ మైనింగ్ లను సందర్శించారు. రెండు రోజుల పర్యటన ముగిసిన అనంతరం సోమవారం శిక్షణా ఐఏఎస్ అధికారులు ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించిన పర్యటనకు సంబంధించిన వివిధ అంశాలను అధికారుల బృందాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులు తమ పరిశీలనలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విధులు నిర్వహించే ప్రతి అధికారికి క్షేత్ర స్థాయి అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే గ్రామీణ, స్థానిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవడం అవసరమని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు.